
## వేణు విద్య ఆసుపత్రి నిర్లక్ష్యం



ప్రజాపక్షం/నల్లగొండ టౌన్: జిల్లా కేంద్రంలోని ఓకార్పొరేట్ ఆసుపత్రిలో వైద్య నిర్లక్ష్యం వెలుగుచూసింది.చికిత్స కోసం వచ్చిన ఆరు నెలల గర్భిణికి గైనకాలజిస్ట్ గర్భనిరోధక మాత్రలు రాసి ఇచ్చిన ఘటన కలకలం రేపింది. పట్టణంలోని వేణు విద్య హాస్పిటల్‌లో ఈ ఘటన చోటుచేసుకుంది.దీంతో బాధితురాలి కుటుంబ సభ్యులు ఆసుపత్రి ఎదుట ఆందోళనకు దిగారు. ప్రభుత్వ వైద్యురాలి ప్రైవేటు ప్రాక్టీస్‌పై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.బాధితుల కథనం ప్రకారం. గిరకబాయి గూడేనికి చెందిన మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి వేణు విద్య ఆసుపత్రిలోనే వైద్య సేవలు పొందుతున్నారు.ప్రస్తుతం ఆమె ఆరో నెలలో ఉండగా,సాధారణ చెకప్ కోసం రాగా గైనకాలజిస్ట్ డాక్టర్ విద్యా భార్గవి మందులు రాసిచ్చారు.అయితే ఆ ప్రిస్క్రిప్షన్‌పై అనుమానంతో ఇతర వైద్యులకు చూపించగా,అవి గర్భనిరోధక మాత్రలని తేలింది. ఈమందులు వాడితే తల్లి,బిడ్డ ఇద్దరికీ ప్రాణాపాయం ఉంటుందని వైద్యులు హెచ్చరించడంతో బాధిత కుటుంబం దిగ్భ్రాంతికి గురైంది. ఆసుపత్రి నిర్లక్ష్యంపై బాధితులు మండిపడుతున్నారు. ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంబంధిత వైద్యురాలిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రజాపక్షం
జిల్లా అనుబంధం
నల్లగొండ సూర్యాపేట యాదాద్రి
బుధవారం | 29 ఏప్రిల్ , 2026 | పేజీలు : 06

# చేతిలో సెల్లు.. జేబులు చిల్లు!

**అడ్డగోలుగా ఫోటోలు తీస్తూ...**
**హడలెత్తిస్తున్న ట్రాఫిక్ పోలీసులు!**
**ఇదేమని అడిగితే మేమింతే అంటున్న వైనం**





ప్రజాపక్షం/సూర్యాపేట : ట్రాఫిక్ పోలీసుల చేతిలో సెల్లు... వాహనదారుల జేబులకు చిల్లులు పడుతున్నాయి.. అడ్డగోలుగా ఫోటోలు తీసి ఈ చలాన్లు విధిస్తూ హడలెత్తిస్తున్నారు. ఇదేమని ప్రశ్నిస్తే మేమింతే అంటూ రుబాబుగా సమాధానం చెబుతున్న పరిస్థితి.

సూర్యాపేట జిల్లా కేంద్రంలో రహదారి ఎక్కాలంటేనే వాహనదారులు బెంబెలు ఎత్తుతున్నారు. ఏ సెంటర్‌లో ఏ పోలీసు వారు ఉంటారో తమ సెల్‌ఫోన్‌లో వాహనం ఫోటో బంధించి జేబులకు చిల్లులు పెడుతారోనని భయం భయంగా వెళ్లాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో వాహనదారులు ఆర్‌సి, డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ లాంటి పత్రాలను తమవద్ద భద్రంగా పెట్టుకొని బయటకు వెళ్లినా అవేమి చూడకుండానే వివిధ కూడల్లో విధులు నిర్వహిస్తున్న పోలీసులు వారికి తెలియకుండానే సెల్‌ఫోన్‌లో తమ వాహనాన్ని చిత్రీకరించి ఈచాలన్లు పద్దట్లుగా మెసేజ్‌లు పంపుతుండడంతో తలలు పట్టుకుంటున్నారు. వాహనానికి సంబంధించిన అన్ని తమవద్ద ఉన్నా తమకు ఏలా ఈచాలన్ పడిందని చూస్తే హెల్మెట్ లేదని, రాంగ్ రూట్‌లో డ్రైవింగ్ చేశారంటూ వందల్లో వేస్తుండడంతో ఆందోళన చెందుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు ట్రాఫిక్‌ను నియంత్రించి ప్రమాదాలు జరగకుండా కాపాడాల్సిన పోలీసులు దానిని పూర్తిగా విస్మరించి కేవలం వాహనాలకు ఈచాలన్లు వేసే పనిలోనే మునిగి తేలుతున్నారు. కుడకుడ, కొత్త బస్టాండ్, ఖమ్మం క్రాస్ రోడ్డు, 65వ జాతీయ రహదారి సమీపంలో ని శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయం, పిఎస్ఆర్ సెంటర్, శంకర్ విలాస్ సెంటర్, కల్నల్ సంతోష్ బాబు విగ్రహం వద్ద, కృష్ణ టాకీస్, ఎన్‌టిఆర్ పార్కు (బొమ్మగాని ధర్మభిక్షం విగ్రహం సమీపంలో) వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు సెల్‌ఫోన్‌లలో ఫోటోలు తీసి ఈ చాలాన్లు ఎడాపెడా వేస్తున్న పరిస్థితులు ఉన్నాయి. దీంతో వాహనదారులు పోలీసుల పద్మవ్యూహం నుండి ఏ మాత్రం తప్పించుకునేలా లేకుండా పోయింది.

**పిల్లలమర్రి స్టేజీ నుండి జనగాం క్రాస్ రోడ్డు వరకు...**

పిల్లలమర్రి స్టేజీ నుండి జనగాం క్రాస్ రోడ్డు వరకు ఏడాదికి పైగా ఫ్లైఓవర్ పనులు నడుస్తున్నాయి. దీంతో పోలీసులు ట్రాఫిక్‌ను మళ్లించడంతో వాహనదారులు దాదాపు 5 కిలోమీటర్లకు పైగా తిరిగి రావాల్సి వస్తుంది. ఈ ఫ్లైఓవర్ నిర్మాణంతో పట్టణంలోకి వచ్చే వాహనదారులు ఎన్‌టిఆర్ పార్కు బొమ్మగాని ధర్మభిక్షం కూడలి నుండి సర్వీసు రోడ్డు నుండి వస్తుండడంతో అక్కడ విధులు నిర్వహిస్తున్న పోలీసులు వాహనాల ఫోటోలు తీసి వందల రూపాయల ఈచాలన్‌లు విధిస్తున్నారు. రోజుకు ఇలా వందల వాహనాలకు ఈచాలన్లు విధిస్తూ జేబులకు చిల్లులు పెడుతున్నారు.

**సూచిక బోర్డులు కూడా లేవు...**

ఫ్లైఓవర్ పనులు నడుస్తున్నప్పుడు వాహనదారులు రాంగ్‌రూట్‌లో రావద్దంటూ సూచికపు బోర్డులు కూడా ఎక్కడా లేవు. హెచ్చరికపు బోర్డులను ఏర్పాటు చేయాల్సిన ట్రాఫిక్ పోలీసులు ఏర్పాటు చేయకపోగా రాంగ్‌రూట్ పేరుతో ఈచాలన్లు వేయడం ఎంత వరకు సబబు అని ప్రశ్నిస్తున్నారు. ఇదేమని ప్రశ్నించిన వారిని లోకువగా చూస్తూ ట్రాఫిక్ రూల్స్ పేరిట అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నా రు. పల్లె నుండి పట్టణాలకు పనికోసం వచ్చే దినసరి కూలీ లు రోజు మొత్తం తాము ఎర్రటి ఎండలో కష్టపడి చెమటోడ్చి సంపాదించిన డబ్బులు ఈచాలన్లకే సరిపోతున్నాయని మా ఇల్లు ఎలా గడుస్తుందని లబోదిబోమంటున్నా రు. ఇదిలా ఉండగా ఆరోగ్యం బాగోలేక చికిత్స కోసం ఆసుపత్రులకు వచ్చే పేదల పరిస్థితి కడు దయనీయంగా ఉంది.

**ప్రమాదాల బారినపడుతుండడంతోనే : ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం**

ఎన్‌టిఆర్ పార్కు సమీపంలో రాంగ్‌రూట్ వల్ల వాహనదారులు ప్రమాదాల బారిన పడుతుండడంతోనే వాహనాల ఫోటోలు తీసి ఈచాలన్లు వేయడం జరుగుతుందని సూర్యాపేట ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం తెలిపారు. ఫోటోలు తీసి ఈచాలన్లు ఎడాపెడా వేస్తున్నారంటూ వాహనదారులు ఆరోపించడంపై ఆయనను ప్రజాపక్షం వివరణ కోరగా ఆ ప్రాంతంలో రాంగ్‌రూట్‌లో రాకుండా ఉండేందుకు వాహనదారులకు ప్రత్యామ్నాయ మార్గం కూడా చూపడం కొంత ఇబ్బందిగానే ఉందని ఫ్లైఓవర్ నిర్మాణంతో ఈ ఇబ్బంది తలెత్తుతుందని చెప్పారు. పట్టణంలో మిగతా చోట్ల ఈచాలన్లు వేయడంపై ఆయన స్పందిస్తూ మైనర్లు, మేజర్లు సరైన వాహన పత్రాలు లేకుండా, రాంగ్ రూట్‌లో వాహనాలు నడపడం వంటి వాటిపైనే ఈచాలన్లు వేయడం జరుగుతుందన్నారు. ఇది ప్రజల ప్రాణరక్షణ కోసమేనని చెప్పుకొచ్చారు.

## బోరు మోటర్ వివాదం కేసులో నిందితుడికి ఏడాది జైలు శిక్ష

ప్రజాపక్షం/రామన్నపేట: స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదుదారురాలు జవ్వాది లక్ష్మమ్మ,భర్త భాషా లిఖితపూర్వక ఫిర్యాదు నమోదు కాగా,ఆ ఫిర్యాదులో ఆమె పేర్కొన్న వివరాల ప్రకారం 25 మార్చి 2019న రాత్రి 9గంటల సమయంలో,తన కుమారుడు జవ్వాజి వెంకటేశం మూత్ర విసర్జన కోసం ఇంటి బయటకు వెళ్లినప్పుడు,అదే గ్రామానికి చెందిన పిట్టల మహేష్ (తండ్రి: లచ్చయ్య) తన మనసులో పాత కక్షలను పెట్టుకుని,తన కుమారుడిపై దాడి చేశాడని.అతను తన కుమారుడిని అసభ్య పదజాలంతో దూషించి,కర్రతో తలపై కొట్టాడని.దీనివల్ల తన కుమారుడి చెవికి మరియు తలకు రక్తస్రావం అయ్యి గాయాలు తగిలాయి.ఈ సంఘటనను తన కోడలు ప్రత్యక్షంగా చూసి,సదరు మహేష్ను అడ్డుకుందని.దాంతో ఆ మహేష్ తన కోడలిపై కూడా దాడి చేసి, ఆమె తలను గోడకు బాది,అక్కడి నుండి పారిపోయాడని.వెంటనే తన కుమారుడికి చికిత్స అందించడం కోసం వేములకొండ గ్రామానికి తీసుకువెళ్లామని.ఆ తర్వాత 26 మార్చి 2019న తన కుమారుడికి తీవ్రమైన తలనొప్పి రావడంతో,మెరుగైన చికిత్స కోసం తన కుమారుడిని నల్గొండకు తీసుకువెళ్లామని.అక్కడి వైద్య అధికారి తన కుమారుడి తలకు స్కానింగ్ చేసి పరీక్షించారు.తన కుమారుడి తలలో ఒక కణితి ఏర్పడినట్లు గుర్తించి,మెరుగైన చికిత్స కోసం హైదరాబాద్కు తరలించాలని వారికి సలహా ఇచ్చారని.ఆ సలహా మేరకు ఆమె తన కుమారుడిని ఎల్.బి. నగర్లోని 'మెడిసిన్' ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం తన కుమారుడు అక్కడ చికిత్స పొందుతున్నాడు. కాబట్టి, సదరు మహేష్పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆమె ఫిర్యాదులో కోరారు.దాని ప్రకారం నమోదైన క్రైమ్ నం.28/2019 (ఐపీసీ 326, 504) కేసును విచారించిన ప్రిన్సిపల్ జూనియర్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ ఎస్.శిరీష మంగళవారం తీర్పు ప్రకటించారు.రామన్నపేట మండలంలోని కొత్తగూడెం గ్రామానికి చెందిన పిట్టల మహేష్ (లచ్చయ్య కుమారుడు)ను నిందితుడిగా నిర్ధారించి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు రూ.1000 జరిమానా విధించారు. బోరు మోటార్ విషయంలో తలెత్తిన వివాదం నేపథ్యంలో ఇరువర్గాల మధ్య గొడవ చోటుచేసుకోవడంతో ఈ కేసు నమోదైంది.సాక్షుల వాంగ్మూలాలు,ఆధారాలను పరిశీలించిన కోర్టు నిందితుడిపై ఆరోపణలు రుజువైనట్లు తేల్చింది.ఈ కేసు విచారణలో నిందితునికి శిక్ష పడేందుకు ఏపీపీ ఖాజా నిజాముద్దీన్,కోర్టు సిబ్బంది వి. రాంబాబు,సత్యనారాయణ సహకరించినట్టు రామన్నపేట ఎస్ఐ డి.నాగరాజు తెలిపారు.

## బంకుల్లో బారులు..!

ప్రజాపక్షం/నకిరేకల్ : పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో ఇంధన కొరత వస్తుందన్న వదంతులు నకిరేకల్‌లో పెట్రోల్ బంకుల వద్ద రద్దీకి దారితీశాయి. తెల్లవారుజాము నుంచే బైకులు,కార్లు,ఆటోలు బంకుల వద్ద బారులు తీరగా ప్రధాన రహదారుల వెంట ఉన్న పెట్రోల్ బంకులు వాహనాలతో కిక్కిరిశాయి.కొందరు క్యాన్లు,బాటిళ్లతో ఇంధనం నింపించుకుంటూ కనిపించారు. దీంతో కొంత ఘర్షణ వాతావరణం నెలకొన్నది.మేమంటే మేము అంటూ వాహనదారులు దూసుక వెళ్తున్నారు.కొన్ని బంకుల్లో డీజిల్ నిల్వలు తక్కువవగా,మరికొన్ని చోట్ల బైక్‌కు రూ.200 విలువైన పెట్రోల్ మాత్రమే అందించారు.వరి కోతల సీజన్‌లో హార్వెస్టర్లు, ట్రాక్టర్లకు,ఆటోలకు,కార్లకు లారీలకు ఇతర వాహనాలకు డీజిల్ కొరత తలెత్తడంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.





## ప్రధానోపాధ్యాయుడికి నివాళి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** గారకుంట తండా ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహిస్తున్న బాణోతు నాగేశ్వరరావు అనారోగ్యంతో మరణించడం వల్ల మంగళవారం సేవాలాల్ సేన మండల అధ్యక్షులు గుగులోతు సందీప్‌నాయక్ విద్యార్థులతో కలిసి ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల క్రమశిక్షణకు మారుపేరుగా విశేష కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ఎంపిటిసి వెంకట్‌రామ్ నాయక్, మాజీ విద్యా కమిటి చైర్మన్ కోటయ్య, బాలు నాయక్, సామాజిక సేవకర్త నరేందర్, జబ్బార్, నర్సింహా పాల్గొన్నారు.

## ఉచిత కుట్టు మిషన్ శిక్షణ ప్రారంభం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని సర్పంచ్ బాణోతు అరుణ రమేష్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గారకుటతండాలో షెడ్యూల్ కులాల అభివృద్ధి సంక్షేమ గడ్డిపల్లి కెవికె, సామాజిక సేవాకర్త నరేందర్ నాయక్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టుమిషన్ శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త సుగందిని, డాక్టర్ అక్షయ్‌కుమార్, జయమ్మ, శారధ, గుగులోతు సందీప్‌నాయక్, బాలునాయక్, నందా నాయక్, కళ్యాణి, భవాని, లలిత, విజయ పాల్గొన్నారు.

## ఆర్థికసాయం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని పోను గోడు గ్రామానికి చెందిన యూసఫ్ ఇటీవల గుండెపోటుతో మృతిచెందాడు. దీంతో అతని కుటుంబం తీవ్ర ఇబ్బందుల్లో పడింది. ఈ విషయం తెలుసుకున్న పోనుగోడుకు చెందిన 2011/12 విద్యోదయ పాఠశాల పూర్వ విద్యార్థులు, తోటి స్నేహితులు కలిసి, చౌట్‌ప్పల్ ఫార్మ క ంపెనీ ఉద్యోగులు కలిసి మిత్రుని కుమారులకు మంగళవారం పదివేల రూపాయల ఆర్థికసాయం అందజేసి మానవత్వం చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో బత్తిని మహేష్, గుడిపూరి ప్రసాద్, అనిల్, ఉదయ్, పవన్, బత్తిని వేణు పాల్గొన్నారు.

## ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు పంపిణీ

**ప్రజాపక్షం/నేరేడుచర్ల:** మండల పరిధిలోని పులగం బండతండా గ్రామ పంచాయతీలో ఉపాధి హామీ పనులుచేస్తున్న కూలీలకు ఎండ తీవ్రత నుండి ఇబ్బంది కలగకుండా ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను మంగళవారం ఎంపిడివో సోమసుందర్‌రెడ్డి, సర్పంచ్ బాణోతు మంగమ్మ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ అధికారి నాగరాజు, ఎపీవో శేఖర్, టెక్నికల్ అసిస్టెంట్, ఫీల్డ్ అసిస్టెంట్, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

# మిల్లర్లు- దళారీల దోపిడీకి గురవుతున్న రైతులు



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** నాగార్జునసాగర్ ఆయకట్టు పరిధిలోని రైతులు ఎండనక, వాననక రేయింబవుళ్లు కష్టపడి పంట పండించి మిల్లర్ల దగ్గరికి ధాన్యం అమ్ముకోవడం కోసం రైతులు వెళ్తే, ధాన్యం కొనుగోలు చేయకపోగా వారిని బిచ్చగాళ్ల కంటే హీనంగా చూస్తూ ఇక్కడ నుండి వెళ్లమని కసురుకుంటున్నారని, వారిని నచ్చిన విధంగా రోజుక ధరను నిర్ణయిస్తూ ధాన్యాన్ని కొనుగోలు చేస్తూ రైతులను నిలువు దోపిడి చేస్తున్నారని, ఐనా ప్రభుత్వానికి గాని, ప్రభుత్వ అధికారులకు గాని ఏమీ పట్టనట్లుగా చోద్యం చూస్తున్నారని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పోకల వెంకటేశ్వర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మండల పరిధిలోని గానుగ బండ గ్రామంలో జరిగిన సిపిఐ గ్రామ కమిటి సమావేశంలో ఆయన మాట్లాడుతూ వేసంగి పంట చేతికి రావడానికి రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని, అనేక రకాల తెగుళ్లు వచ్చిన కూడా ఎప్పటికప్పుడు క్రిమి సంహారక మందులను తెచ్చుకుని తెగుళ్ల బారీ నుండి పొలాలను కాపాడుకొని పంట పండించి అమ్ముకోవడానికి వస్తే మిల్లర్లు, దళారీలు దోపిడి చేస్తున్నారే తప్ప గిట్టుబాట ధర ఇవ్వడం లేదని అన్నారు. ఈ సమావేశంలో సిపిఐ మండల కార్యదర్శి కడియాల అప్పయ్య, సిపిఐ మండల కార్యవర్గ సభ్యులు కుందురు వెంకటరెడ్డి, పోకల ఆంజనేయులు, తాళ్ల తిరపయ్య, మొండె వెంకటేశ్వర్లు, కట్ట నర్సింహరావు, పోకల నర్సింహరావు, ఈశ్వరచారి, నబీసాహెబ్, వెంకటేశ్వర్లు, అచ్చయ్య పాల్గొన్నారు.

# భూ కబ్జాకు తప్పడు పత్రాల సృష్టి




**ప్రజాపక్షం/మోతె :** కౌలుకు భూమి ఇస్తే కబ్జా కోసం తప్పుడు పత్రాలు సృష్టించి భూ యజమానిపై దాడికి దిగిన సంఘటన మంగళవారం మండలంలోని భీక్యతండ గ్రామంలో చోటుచేసుకుంది. బాధితులు ధరావత్ రామకృష్ణ అనితలు తెలిపిన వివరాల ప్రకారం భీక్యతండ గ్రామంలో సర్వే నంబర్ 647/ఆ1 గల భూమిని గ్రామంలోని పెద్దల సమక్షములో ఒక ఎకరం భూమిని కొనుగోలు చేసి వ్యవసాయం చేస్తున్నామన్నారు. కొంత కాలం వరకు భూమిని కౌలు కోసం చిన్నాన అయిన బానోతు లింబాకు ఇవ్వగా అదును చూసి తప్పుడు పత్రాలు సృష్టించి పట్టాను చేయించుకోవాలని ప్రయత్నం చేయగా అప్పటి తహశీల్దార్ సమాచారం మేరకు తిరిగి మాకు పట్టా చేయడం జరిగిందని చెప్పారు. మరల సోమవారం రాత్రి పొలం కోయించడానికి వెళ్లగా బానోతు లింబా కుటుంబ సభ్యులు బానోతు శ్రీను, సక్కు, జ్యోతి, కళమ్మలు మరో పది మంది కిరాయి మనుషులతో మాపై కర్రలతో దాడి చేయగా తృటిలో ప్రాణాపాయం నుండి బయటపడి 100కు ఫోన్ చేసి పోలీసుల సహకారంతో బతికి బయటపడ్డామన్నారు. తప్పుడు పత్రాలతో మాపై దాడికి వచ్చే వారితో తమకు ప్రాణహాని ఉందని తక్షణమే పోలీసు అధికారులు వారిపై చర్యలు తీసుకొని మాకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

# యువతకు పార్టీ పదవుల్లో ప్రాధాన్యత



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** భవిష్యత్తులో కాంగ్రెస్ పార్టీ పదవుల్లో యువతకు మరింత ప్రాధాన్యత కల్పించే దిశగా అధిష్టానం దృష్టికి తీసుకువెళ్తామని తెలంగాణ యూత్ స్టేట్ ఇంచార్జి భవ్య అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పార్టీ కార్యాలయంలో యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలిమినేటి అభినయ్ ఆధ్వర్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పార్టీ బలోపేతానికి యువత కీలక శక్తిగా నిలుస్తుందని తెలిపారు. యువతకు తగిన గుర్తింపు, అవకాశాలు కల్పించడం ద్వారా పార్టీ మరింత బలపడుతుందని ఈ అంశాన్ని ఉన్నతస్థాయి నాయకత్వం ముందు ప్రస్తావిస్తామని స్పష్టం చేశారు. యువతలో ఉన్న ఉత్సాహం, ఆలోచనా శక్తి, నాయకత్వ లక్షణాలు పార్టీని మరింత బలోపేతం చేస్తాయని తెలిపారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్రస్థాయి వరకు యువజన కాంగ్రెస్ కార్యకర్తలు పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తున్నారని అభినందించారు. స్టేట్ వైస్ ప్రెసిడెంట్ పొన్నం తరుణ్, జిల్లా ఇంచార్జిలు సురేష్, రమ్యకృష్ణ, జిల్లా ఉపాధ్యక్షులు శ్రావ్య, కుక్కడపు మహేష్, జావిద్‌బేగ్, బొడ్డు సాయి పాల్గొన్నారు.

# మంత్రి ఉత్తమ్‌పై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదు



**ప్రజాపక్షం/కోదాడ రూరల్ :** మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిపై అసత్య ఆరోపణలు చేస్తే సహించేది లేదని మండల పార్టీ అధ్యక్షులు తూమాటి వరప్రసాద్ రెడ్డి హెచ్చరించారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల ఆయన మాట్లాడుతూ హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంత్రిపై బిఆర్‌ఎస్ నేత ఒంటెద్దు నరసింహారెడ్డి చేసిన నిరాధారమైన, అసత్య ఆరోపణలను ఖండిస్తున్నట్లు తెలిపారు. వార్డు మెంబర్‌గా కూడా గెలువలేని ఒంటెద్దు నరసింహారెడ్డి దేశ రక్షణ కోసం సరిహద్దుల్లో పనిచేసి, రాష్ట్ర అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తున్న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని విమర్శించే స్థాయి నీదా అని ప్రశ్నించారు. వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయమే కోదాడ రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వివరించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు ఈర్ల సీతారాంరెడ్డి, బాసబోయిన భాస్కరరావు, మందులపు శేషు, సర్పంచులు పాలకి సురేష్, బల్గూరి స్నేహదుర్గయ్య, మందుల నాగయ్య, హాజీనాయక్, కన్నారెడ్డి, జయసింహారెడ్డి, రాములు నాయక్, మండల నాయకులు పాల్గొన్నారు.



## పంచామృత అభిషేకములు

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** హుజూర్‌నగర్ మండల పరిధిలోని శ్రీ ఆది వరహాలక్ష్మి నర్సింహా వేణుగోపాల స్వామి దివ్యక్షేత్రంలో వెంచేసిన క్షేత్రపాలకుడు శ్రీ ఆంజనేయ స్వామికి మంగళవారం పంచామృత అభిషేకములు 108 తమల పాకులచే ఆకుపూజ, గంధ సింధూరము, పానకం, వడపప్పు, పండ్లు, నారికేళం, పులిహోర, వడమాల, ప్రసాద నివేదనలతో పూలదండ అలంకరణ సహిత పూజ కార్యక్రమాలను ఆలయ అర్చకులు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణ అధికారి ఎంపి లక్ష్మ ణరావు, ఆలయ కమిటి చైర్మన్ యరగాని బిక్షంగౌడ్, ధర్మకర్త యరగాని సతీష్, పార్తనబోయిన గంగయ్య, యరగాని గురవయ్య, విశ్వనాథ్, వెంకన్న, రమేష్, పర్వతాలు, లక్ష్మి పుష్ప, ఆరుణమ్మ పాల్గొన్నారు.

## నేటి నుండి బ్రహ్మోత్సవాలు



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** పట్టణంలోని ప్రసిద్ధ శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో నేటి (బుధవారం) నుండి బ్రహోత్సవాలు జరగనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు తెలిపారు. మంగళవారం ఆలయంలో ఉత్సవ పూర్వరంగ కార్యక్రమాలను ప్రారంభించారు. ఉదయం స్వామివారికి ఉత్సవ ఆరంభ స్నపనం (108 కలశములతో అభిషేకం) నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. సాయంత్రం ఆలయ ముఖ మండపంలో విశ్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అంకురార్పణ, ధ్వజపట ఆదివాసం నిర్వహించారు. బుధవారం ఉదయం అగ్నిప్రతిష్ట, ధ్వజారోహణం, గరుడముద్ద, ద్వార తోరణ ధ్వజ కుంభ ఆరాధనలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందించనున్నట్లు ఆయన తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగే ఈ బ్రహోత్సవాలలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వికాస తరంగిణి జోనల్ ఇంచార్జి జ్యోతిరెడ్డి, వికాస తరంగిణి సభ్యులు బజ్జూరి కృష్ణయ్య, చల్లా శ్రీనివాస్, కరుణాసాగర్ రెడ్డి, చికూరి శ్రీనివాస్, తాటికొండ మంజుల, జ్ఞానకుమారి, వనజ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఇసుక ట్రాక్టర్ ఢీకొని వృద్ధురాలు మృతి

**ప్రజాపక్షం/అనంతగిరి:** ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం వల్ల ట్రాక్టర్ ఢీకొని ఓ వృద్ధురాలు మృతిచెందిన సంఘటన మంగళవారం మండల పరిధిలోని ఖానాపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఖానాపురం గ్రామంలో ఇసుక ట్రాక్టర్ డ్రైవర్ పల్లపు నాగరాజు తన ట్రాక్టర్‌ను అతివేగంగా, అజాగ్రత్తగా వెనక్కి రివర్స్ నడుపుతూ అదే గ్రామానికి చెందిన కనగాల రామకోటమ్మ (72)కు వెనుక నుండి ఢీకొట్టడంతో రామకోటమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో ట్రాక్టర్ డ్రైవర్ వెంటనే పరారయ్యాడు. మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతురాలి కుమారుడు కనగాల శేషయ్య పిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు అనంతగిరి ఎఎస్ఐ లింగారెడ్డి తెలిపారు.

## చలివేంద్రం ప్రారంభం



**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల పరిధిలోని చెన్నకేశవపురం గ్రామంలో వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని గ్రామ ప్రజలకు ఉపయోగపడేలా గ్రామానికి చెందిన మహి మానిత్వ చారిట్రబుల్ ట్రస్టు వారి ఆధ్వర్యంలో బస్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ట్రస్టు ఫౌండర్ స్థానిక ఫాస్టర్ మహేష్‌పాల్ మాట్లాడుతూ కుల, మతాలకు అతీతంగా గ్రామ ప్రజలందరూ చలివేంద్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు.



## కాంగ్రెస్ హయాంలోనే గ్రామాలు అభివృద్ధి

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** కాంగ్రెస్ ప్రభుత్వ హాయంలోనే గ్రామాలాభివృద్ధి సాధ్యమని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు త్రిపురం అంజన్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని గారకుంట తండాలో గ్రామ పంచాయతీ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల్లో భాగంగా నూతనంగా నిర్మించిన సిసిరోడ్లు, డ్రైనేజీలను గ్రామ సర్పంచ్ బాణోతు అరుణ రమేష్‌నాయక్ తో కలిసి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో గరిడేపల్లి మాజీ సర్పంచ్ సైదానాయక్, కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షులు సురభి సైదులు, ఉప సర్పంచ్ గౌతమి సుధాకర్, వార్డు సభ్యులు జలేందర్, జయరాం, ఝాన్సీ పాల్గొన్నారు.

## నర్సింగ్ విద్యార్థులకు అవగాహన



**ప్రజాపక్షం/కోదాడ:** ఆడ పిల్లలు ఎక్కువగా ఫోన్ వినియోగం ద్వారా ఎదుర్కొనే సమస్యలు, విద్య దశలో అనుసరించాల్సిన సరైన పద్ధతులు, మంచి అలవాట్లను అలవర్చుకోవాలని జిల్లా బాలల పరిరక్షణ విభాగం ప్రొటెక్షన్ ఆఫీసర్లు విద్యాసాగర్, మీరా లు అన్నారు. మంగళవారం కోదాడ పట్టణంలోని మహిళ శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో స్నేహ నర్సింగ్ కళాశాలలో చదువుతున్న విద్యార్థుల అవగాహన కార్యక్రమంలో వారు పాల్గొని మాట్లాడారు. పిల్లల ప్రవర్తన, కుటుంబ వ్యవస్థ ప్రాధాన్యత, విద్య భవిష్యత్‌కు పునాది అనే అంశాలను వివరించారు. చెడు స్నేహాల వల్ల కలిగే నష్టాలు, తల్లిదండ్రుల పట్ల ఎలా ప్రవర్తించాలతో సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బాలల సంరక్షణ శాఖ అధికారులు, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## 8వ వార్షికోత్సవ వేడుకలు

**ప్రజాపక్షం/నడిగూడెం:** మండల కేంద్రంలోని శ్రీకోదండ రామస్వామి ఆలయంలో మంగళవారం 8వ వార్షికోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారి మూల విరాట్‌లకు పంచామృతాలు, పండ్ల రసాలతో ప్రత్యేక అభిషేకం నిర్వహించారు. కలశాలను గుడిచుట్టు ప్రదర్శన నిర్వహించి కలశ స్థాపన చేశారు. దేవాలయ పూజారి ఎస్‌బి వరదాచార్యులు సీత సమేత కోదండ రామ లక్ష్మణ్‌లకు ప్రత్యేక అలంకరణ పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు వెంకటరత్నం, కొండ వెంకట సత్యనారాయణ, వందను సూర్యప్రకాశ్‌రావు, మోహన్‌రావు, దయాకర్, ఎస్ ఎన్‌మూర్తి, మహేష్, అప్పారావు పాల్గొన్నారు.



## విశ్రాంత ఉద్యోగుల పట్ల సర్కారు తీరు దారుణం



**ప్రజాపక్షం/కోదాడ:** రాష్ట్రంలోని ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగుల పట్ల ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు అత్యంతదారుణంగా ఉందని తెలంగాణ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం అసోసియేట్ అధ్యక్షులు రావెళ్ల సీతరామయ్య ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పెన్షనర్స్ భవనంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుదీర్ఘకాలం ప్రభుత్వానికి సేవలందించి విశ్రాంతి తీసుకుంటున్న వారిని ఇబ్బందులకు గురిచేయడం తగదన్నారు. గత 20 ఏళ్ల క్రితం పరిస్థితిచూస్తే ఉద్యోగి రిటైర్ కావడానికి నాలుగు రోజుల ముందే రావాల్సిన అన్ని బకాయిలు చేతికి వచ్చేవి కాని, నేడు రిటైర్డ్ అయి ఏళ్ల గడుస్తున్నా ప్రభుత్వం నుంచి రావాల్సిన ఆర్థిక ప్రయోజనాలు అందకపోవడం దురదృష్టకరమన్నారు. సకాలంలో రిటైర్మెంట్ బకాయిలు అందక ఆర్థిక ఇబ్బందులతో ఎంతోమంది విశ్రాంత ఉద్యోగులు మనోవేదనకు గురవుతున్నారని అన్నారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న బకాయిలన్నింటిని విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు బొల్లు రాంబాబు, రఘువరప్రసాద్, వేనేపల్లి శ్రీనివాస రావు, తమ్మనబోయిన వీరబాబు, గులాం ఎస్‌దాని, జానయ్య, భ్రమరాంబ, బాలేమియా, హాజీనాయక్, భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

## రైతులు దళారులను నమ్మి మోసపోవద్దు



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఆరుగాలం కష్టించి పండించిన పంటను విక్రయించడానికి దళారులను నమ్మి మోసపోవద్దని ప్రభుత్వం కేటాయించిన ధాన్యపు కొనుగోలు కేంద్రాల వద్దనే గిట్టుబాటు ధరకు అమ్ముకోవాలని మున్సిపాలిటీ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు కోరారు. సీతవాణి గూడెం, మద్దివాని గూడెం, నారాయణగిరిలలో వ్యవసాయ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ దేవరాయకుమార్ డైరెక్టర్లు మద్ది అంజిరెడ్డి, కుక్క దానయ్య, సీఈవో సద్దిపల్లి బాల్రెడ్డి, మద్ది మధుసూదన్ రెడ్డి, సామల సుధాకర్ రెడ్డి, సామల రాజిరెడ్డి, రామస్వామి బాల్ రెడ్డి, రామసాని అంజిరెడ్డి, కొమురెల్లి ప్రతాపరెడ్డి, బద్దం భాస్కర్ రెడ్డి, దోతి భాస్కర్, గంగాదేవి మహేష్ మరియు రైతులు తదితరులు పాల్గొన్నారు.

## వేంకటేశ్వర స్వామి నిత్య కల్యాణోత్సవం



**ప్రజాపక్షం/భువనగిరి :** కలియుగ ప్రత్యక్ష దైవమైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి ప్రాతఃకాలంలో అర్చక స్వాములు సుప్రభాత సేవను విశేషంగా నిర్వహించారు. సుప్రభాతసేవ అనంతరం శ్రీ మహాలక్ష్మి అమ్మవారు, ముప్పది మూడు కోట్ల దేవతలు కొలువుతీరినట్టి గోపృష్ట దర్శనాన్ని చేయించడం జరిగింది. శ్రీ వేంకటేశ్వర స్వామివారికి నిత్యారాధన నిమిత్తం అర్చక స్వాములు వేద మంత్రోచ్ఛారణలతో సువర్ణ బిందె తీర్థమును బంగారుబావి నుండి తీసుకువచ్చారు. అలంకార ప్రియుడైన స్వర్ణగిరి శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి అర్చక స్వాములు మేళతాళ మృదంగ మంగళ ధ్వనుల మధ్య సుగంధ భరితమైన పుష్పమాలలతో తోమాల సేవను నయన మనోహరంగా నిర్వహించారు. శ్రీ వేంకటేశ్వర స్వామి వారిని మని మయ శోభిత స్వర్ణాభరణాలతో పరిమళభరిత పుష్పమాలలతో శోభాయమానంగా అలంకరించి వేయి నామాల శ్రీ వేంకటేశ్వర స్వామి వారికి సహస్ర నామార్చన సేవను ఘనంగా నిర్వహించారు. అర్చక స్వాములు వేదమంత్రోచ్ఛారణలతో శ్రీ స్వామివారిని అర్చించి కర్పూర మంగళహారతులు సమర్పించారు.భక్తులు నయనానందకరంగా శ్రీవారినీ దర్శించుకున్నారు.

## అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కర రావు జనాభా లెక్కల శిక్షణా కార్యక్రమాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఎన్యూమరేటర్లను ఉద్దేశించి మాట్లాడుతూ వేసవి కాలంలో సర్వే నడుస్తున్నది కాబట్టి ఉదయం పూట త్వరగా వచ్చి వివరాలను సేకరించాలని, డేటా సక్రమంగా వచ్చేలా సక్రమంగా పని చేయాలని, అన్ని వివరాలను ప్రజలనుండి సేకరించాలని తెలియజేశారు. తదుపరి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని తనిఖీ చేశారు. డాక్టర్‌తో మాట్లాడి ఆసుపత్రిలో ఉన్న సౌకర్యాలు, స్టాఫ్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టాఫ్ సక్రమంగా వస్తున్నారా లేదా అని అడిగి తెలుసుకుని, ఇప్పుడు ఉన్న ఖాళీలలో సిబ్బందిని కేటాయిస్తామని తెలియజేశారు.



## నేతన్న భరోసా నిధులు కార్మికుల ఖాతాలో జమ



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు అందిస్తున్న నేతన్న భరోసా నిధుల కింద పోచంపల్లి మండల వ్యాప్తంగా ఉన్న వీవర్స్, అనుబంధ కార్మికులు మొత్తం 3059 మందికి గాను రూ 94లక్షల 30 వేల 500లను మంగళవారం ఖాతాలో జమ చేసినట్లు హ్యాండ్లూమ్ ఏ డి శ్రీనివాస్ తెలిపారు.దీంతో పట్టణంలో 3033 మంది కార్మికులకు లబ్ధి చేకూరింది. వీవర్ కు రూ 4000 అనుబంధ కార్మికుడికి రూ.1500 చొప్పున ఖాతాలో జమ చేసినట్లు వివరాలు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా 10750 నేత కార్మికులకు గాను రూ.3 కోట్ల 30 లక్షల 16వేలను కార్మికుల ఖాతాలో జమ చేసినట్లు చెప్పారు. చేనేత జన సమాఖ్య జిల్లా అధ్యక్షులు కర్ణాటి పురుషోత్తం ప్రధాన కార్యదర్శి ఆటిపాముల మహేందర్ డైరెక్టర్ ఏలే శ్రీనివాస్ ఉన్నారు.



## ఇంటర్మీడియట్ రాష్ట్ర ర్యాంకర్ ధరణిని సన్మానించిన మంత్రి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణంలోని ఇందిరమ్మ కాలనీ 6వ వార్డుకు చెందిన శివర్ల యాదగిరిజ్యోతి దంపతుల కుమార్తె ధరణి మిర్యాలగూడ మైనార్టీ గురుకులంలో విద్యనభ్యసించగా ఇటీవల ప్రకటించిన ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాల్లో ద్వితీయ సంవత్సరం బైపీసీలో 994 మార్కులు సాధించగా మంగళవారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో విద్యార్థినిని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, స్థానిక ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్సీ కెతావత్ శంకర్‌నాయక్, డీసీసీ అధ్యక్షుడు పున్నా కైలాష్‌నేతలు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఆడోతు అశోక్, అంబటి వెంకటకృష్ణ, నాగునాయక్, పల్లె భాస్కర్, కొట్ట ఆంజనేయులు తదితరులు ఉన్నారు.

## వృద్ధురాలి మెడలో నుంచి 4 తులాల గొలుసు అపహరణ

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** వృద్ధురాలు మెడలో నుంచి నాలుగు తులాల బంగారం గొలుసులను ఓ వ్యక్తి అపహరించిన సంఘటన పట్టణంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సోమవారం రాత్రి 8.30గంటల సమయంలో రెడ్డికాలనీలోని దుర్గాజిమ్‌లో పనిచేస్తున్న గౌరు వజ్రమ్మ అనే వృద్ధురాలు తమ సమీప బంధువులతో కలిసి నడిచి వెళ్తుండగా ఓ యువకుడు ఆమె మెడలోని గొలుసులను బలవంతంగా లాక్కెళ్లిపోయాడని, అవి నాలుగు తులాలుగా రెండు గొలుసులు చోరీకి గురైనట్లు గౌరు వజ్రమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వెంటనే సంఘటన స్థలాన్ని డీఎస్పీ, వన్ టౌన్ సీఐ సందర్శించారు. అనంతరం సీసీ ఫుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలిస్తున్నట్లు తెలిపారు. నిందితుల వివరాలు తెలిస్తే మిర్యాలగూడ పోలీస్ స్టేషన్ 8712670149, 9014555290 నెంబర్లకు సమాచారం అందించాలన్నారు.

## ప్రమాదవశాత్తు చెత్తకుప్పకు నిప్ప



**ప్రజాపక్షం/నడిగూడెం:** నడిగూడెం మండల కేంద్రంలోని బస్టాండ్ పక్కన గల రాజావారు నిర్మించిన బావి వద్ద చెత్తచెదారంతో పూడిపోగా ఆ చెత్తకు అర్ధరాత్రి 12 గంటల సయయంలో ప్రమాదవశాత్తు నిప్పంటుకుని పెద్ద మొత్తంలో మంటలు రావడంతో చుట్టుపక్కల ప్రజలు చూసి సర్పంచ్‌కు, పోలీస్ వారికి సమాచారం అందించడంతో వెంటనే ఆ ప్రాంతానికి చేరుకున్న సర్పంచ్ దున్న శ్రీనివాస్, పోలీసులు ప్రజల సహకారంతో మంటలు అదుపులోకి తెచ్చారు. దీంతో పెద్ద ప్రమాదం తప్పిందన్నారు. బావి చుట్టుపక్కల నాలుగైదు గడ్డివాములు ఉ ండటంతో గడ్డివాములకు మంటలు వ్యాపించి ఉంటే పెద్ద ప్రమాదం ఉండేదన్నారు. కోదాడ నుండి ఫైర్ ఇంజన్ వచ్చి పూర్తిస్థాయిలో మంటలు ఆర్పటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. పోలీస్ సిబ్బంది ప్రతాపరెడ్డి, శ్రీను, గ్రామస్తులు శ్రీనివాసరెడ్డి, అనిల్, శ్రీనివాస్, గిల్‌క్రిస్ట్ పాల్గొన్నారు.

## రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు



**ప్రజాపక్షం/అడ్డగూడూరు :** రైతు అవగాహన కార్యక్రమంలో భాగంగా ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తల చేపలు అంశాలపై చర్చించారు. ఈ అవగాహన కార్యక్రమంలో తక్కువ యూరియా వాడకం గురించి, సమతుల్య ఎరువుల వినియోగం, మైక్రో న్యూట్రియంట్స్ ప్రాముఖ్యత, సేంద్రియ పద్ధతులు, ఆధునిక సాగు విధానాలు గురించి వివరించారు. డా.ఎన్.ప్రవీణ్ ప్రొఫెసర్, సైంటిస్ట్ ఎఎంసీ డైరెక్టర్ సోమయ్య, పాండు రంగాచారి ఏఓ, అక్షర ఏఈఓ పాల్గొన్నారు.



## గుడిసె దగ్ధం

ప్రజాపక్షం/అడ్డగూడూరు : మండలంలోని చౌల్లరామారం జంగాల కాలనీలో మంగళవారం విద్యుత్ షార్ట్ సర్క్యూట్తో పూరి గుడిసె పూర్తిగా దగ్ధమైంది. కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్న ఊర మత్స్యగిరి పనులకు వెళ్లగా, భార్య పిల్లలు గుడిసెలో ఉండగానే ఒక్కసారిగా మంటలు చెలరేగి నిత్యావసర సరుకులు, దుస్తులు కాలిపోయాయి. సుమారు రూ.15 వేల ఆస్తి నష్టం జరిగినట్లు బాధితుడు తెలిపాడు. నివాసం కోల్పోయిన కుటుంబంకు ప్రభుత్వ సహాయం అందించాలని పలువురు కోరుతున్నారు.

## మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన



ప్రజాపక్షం/నేరేడుచర్ల: మాదకద్రవ్యాలు, గంజాయి డ్రగ్స్ భారీ నుండి మన పిల్లలను మన సమాజాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని నేరేడుచర్ల ఎస్ఐ రవీందర్ అన్నారు. ప్రజా పాలన, ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం పట్టణంలో మాదకద్రవ్యాల నిర్మూలనపై పోలీసుల ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రగ్స్ వినియోగించడం వల్ల యువత జీవితం నాశనం అవుతుందని, జీవితం అర్ధంతరంగా ముగుస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

## బాలికల రక్షణ తల్లిదండ్రుల బాధ్యత



ప్రజాపక్షం/నాంపల్లి: కిశోర బాలికలు గర్భం దాల్చడం, డ్రగ్స్కు అలవాటు పడడం, చెడు ప్రవర్తనకు లోనుకాకుండా చూడాల్సిన బాధ్యత తల్లిదండ్రుల దేనని అంగన్వాడీ సూపర్వైజర్ మంజుల పేర్కొన్నారు.మంగళవారం మండలంలోని పసునూరు సెక్టార్లోని 23 అంగన్వాడీ కేంద్రాల్లో బాలికల అవగాహన సదస్సులు నిర్వహించారు.పిల్లల పట్ల దురుసుగా,అవహేళనగా ప్రవర్తించే వారిని శిక్షించడానికి ప్రత్యేక చట్టాలు ఉన్నాయని ఆమె తెలిపారు.పిల్లలకు ఎవరైనా ఇబ్బంది కలిగిస్తే సైబర్ క్రైమ్ హెల్ప్లైన్ నంబర్ 1930, చైల్డ్లైన్ 1098,పోలీస్ 100 నంబర్లకు వెంటనే సమాచారం అందించాలని సూచించారు.ఈకార్యక్రమంలో సుమతమ్మ,గ్రామ పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## చలివేంద్రం ప్రారంభం

ప్రజాపక్షం/డిండి; చెరుకుపల్లి గ్రామంలో గ్రామ సర్పంచ్ మీసాల రామచంద్రయ్య మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. గ్రామంలోకి వచ్చే ప్రజల దాహాన్ని తీర్చుకోవడానికి ప్రత్యేకంగా ప్రజల కోసం చలివేంద్రం ఏర్పాటు చేసినట్లు రామచంద్రయ్య తెలిపారు. ఈకార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పాల్గొన్నారు.

## మున్సిపాలిటీ కో -ఆప్షన్ సభ్యుల ఎన్నిక...



ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ మునిసిపల్ కో ఆర్షన్ సభ్యుల ఎన్నికను పురపాలిక కార్యాలయంలో మంగళవారం మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కమిషనర్ పూర్ణ చందర్ అధ్యక్షతన కౌన్సిల్ ప్రత్యేక సమావేశం జరిగింది. అనంతరం కో ఆప్షన్ సభ్యుల ఎన్నికల్లో దేవరకొండ ఎంఎల్ఏ నేనావత్ బాలునాయక్ పాల్గొని నూతనంగా ఏకగ్రీవంగా ఎన్నికైన దేవరకొండ మున్సిపాలిటి నలుగురు కో ఆప్షన్ సభ్యులును అభినందించి, శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా మున్సిపల్ చైర్మన్ మాట్లాడుతూ ఎన్నికైన సభ్యులు దేవరకొండ పట్టణ అభివృద్ధి కోసం తీసుకోవాల్సిన చర్యలపై కౌన్సిల్ సభ్యులకు సలహాలు, సూచనలు చేశారు. కాంగ్రెస్ తరుపున బరిలో నిలిచిన నలుగురు కో ఆప్షన్ సభ్యులు ఏకగ్రీవంగా విజయం సాధించడంతో తమ పాలకవర్గానికి మరింత బలం చేకూరిందని తెలిపారు. ఈఎన్నికల్లో 12 మంది కాంగ్రెస్ కౌన్సిల్ సభ్యులతో పాటు ఆరుగురు బిఆర్ఎస్ సభ్యులు, ఒక ఇండిపెండెంట్, ఒక బిజెపి సభ్యులు కూడా మద్దతు తెలుపుతూ చేయి ఎత్తి బలపరచడంతో నాలుగు స్థానాలను కాంగ్రెస్ కైవసం చేసుకుంది. నూతన కో ఆప్షన్ సభ్యులుగా గార్లపాటి దామోదర్, నేతాళ్ళ భాగ్యలక్ష్మి, మైనోద్దీన్, శిపోరమ్మల ఎన్నిక లాంచనమైంది. ఈసందర్భంగా ఎంఎల్ఏ బాలునాయక్ మాట్లాడుతూ దేవరకొండ మున్సిపాలిటి పరిధిలోని ప్రజలకు అత్యుత్తమ సేవలను అందించాలని కో ఆప్షన్ సభ్యులకు సూచించారు. దేవరకొండ మున్సిపాలిటిలోని అన్ని వర్గాల ప్రజల సంక్షేమం, మౌలిక వసతుల కల్పన, స్వచ్ఛత, పారదర్శక పాలన కోసం మీరు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్, చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

## మేడే ఉత్సవాలను జయప్రదం చేయండి




ప్రజాపక్షం/మునుగోడు: కార్పొరేట్ శక్తులను పెంచి పోషిస్తూ కార్మికుల శ్రమను దోచుకుంటున్న మతతత్వ బీజేపీ ప్రభుత్వం గద్దె దిగేవరకు అన్ని కార్మిక సంఘాలు ఏకమై పోరాడాలని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు గురిజ రామచంద్రం కార్మికులకు పిలుపునిచ్చారు.మే1న నిర్వహించే కార్మికుల అంతర్జాతీయ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని మంగళవారం మండల కేంద్రంలోని సిపిఐ మండల పార్టీ కార్యాలయంలో జరిగిన మండల కార్యవర్గ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఆర్టీసీ సమ్మె సమయంలో ఆర్టీసీ కార్మికులకు ఇచ్చిన హామీలన్నీ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి తీర్పారి వెంకటేశ్వర్లు,సిపిఐ మండల కార్యదర్శి చాపల శ్రీను,కార్యవర్గ సభ్యులు వనం వెంకన్న,మండల పొందు,మునుగోటి దయాకర్, ఈదులకంటి కైలాస్,గోస్కొండ లింగయ్య,ఏఐటీయూసీ మండల కార్యదర్శి బెల్లం శివయ్య,పరమేష్, శంకర్, నరసింహ, ఆనగంటి నరసింహ, తాడికొండ సైదులు, బి. ఎల్లయ్య, కొండ అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## కడదాకా కమ్యూనిస్టుగా బతికిన నరసింహ



ప్రజాపక్షం/రామన్నపేట : సిరిపురం గ్రామ సిపిఐ(ఎం) సీనియర్ నాయకుడు మాజీ పాల సంఘం చైర్మన్ దోమలపల్లి నరసింహ మరణం పార్టీకి ప్రజాఉద్యమాలకు తీరని లోటని సిపిఎం జిల్లా సీనియర్ నాయకులు మేక అశోక్ రెడ్డి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జల్లెల పెంటయ్య అన్నారు. దోమలపల్లి నరసింహ అనారోగ్యంతో మృతి చెందిన సందర్భంగా అంతిమయాత్రలో పాల్గొని అనంతరం మాట్లాడుతూ నరసింహ చిన్నతనం నుండి విద్యార్థి, యువజన ఉద్యమంలో కీలక భూమిక పోషించి, గ్రామ ప్రజా పోరాటాల్లో గత కాలం నుండి భాగస్వామ్యంగా ఉంటూ శాఖ సహాయ కార్యదర్శిగా రెండు సార్లు పాల సంఘం చైర్మన్గా బాధ్యతలు స్వీకరించి గ్రామంలో రైతులకు ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ అనేక సేవలందించాడు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొద్దుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు బల్గూరి అంజయ్య, వనం ఉపేందర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందుల హనుమంతు, కల్లూరి నాగేష్, మండల నాయకులు గాదె నరేందర్పాల్గొన్నారు.

## రామన్నపేట మండల ప్రజా సమస్యలు పరిష్కరించాలి



ప్రజాపక్షం/రామన్నపేట : రామన్నపేట మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలను పరిష్కరించాలని, ప్రభుత్వ అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి గ్రామాలపై కేంద్రీకరించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు జల్లెల పెంటయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత నెల రోజులుగా గ్రామీణ సమస్యల అధ్యయనంలో భాగంగా సిపిఎం పోరుయాత్రలో వచ్చిన ప్రజా సమస్యలను జిల్లా కమిటీ పిలుపు మేరకు స్థానిక తహసిల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించి అనంతరం తహసిల్దార్ లాల్ బహదూర్కు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ప్రజా సమస్యల తీవ్రంగా పేరుకుపోయాయని అధికార యంత్రాంగం అత్యంత బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి బొద్దుపల్లి వెంకటేశం, జిల్లా కమిటీ సభ్యులు వనం ఉపేందర్, మండల కార్యదర్శి వర్గ సభ్యులు కందుల హనుమంతు, కల్లూరి నాగేష్, గాదె నరేందర్ తొలుపునూరి శ్రీనివాస్, మునికుంట్ల లెనిన్, మేడి ముకుంద, శానగొండ రామచంద్రం, పల్లె సత్యం, బోల్ల వెంకన్న, బావండ్లపల్లి సత్యం, గుణగంటి మల్లేశం, తాడూరి కృష్ణ, తరిగొప్పుల వెంకట రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా ప్రభుత్వం అంటూనే అక్రమ అరెస్టులా?



ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం : తెలంగాణ రాష్ట్రంలో విద్యార్థి యువజన ఉద్యమాలను అణచివేయడం మానుకుంటే రాష్ట్ర ప్రభుత్వానికి మంచిదని లేనియెడల ప్రభుత్వంపై తిరుగుబాటు తప్పదని ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యులు కొండూరు వెంకటేష్ అన్నారు. నేడు పెండింగ్లో ఉన్న ఉపకార వేతనాలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ముఖ్యమంత్రి ఇంటికి పాదయాత్ర కార్యక్రమంలో భాగంగా శాంతియుత నిరసనకు పిలుపునిచ్చిన నాయకులను రాష్ట్రవ్యాప్తంగా ఎక్కడికక్కడ అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిర్బంధించడం ప్రజా ప్రభుత్వం అని చెప్పుకుంటున్న పాలకులకు సిగ్గుచేటని అన్నారు. నేడు ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొండూరు వెంకటేష్ ని సంస్థాన్ నారాయణపురం పోలీస్ స్టేషన్లో ముందస్తుగా అరెస్ట్ చేయడం జరిగింది.

## బాల్య వివాహాలను నిర్మూలించాలి



ప్రజాపక్షం/దేవరకొండ; దేవరకొండ మండల పరిధిలోని మైనంపల్లి గ్రామం వద్ద ఉన్న తెలంగాణ గిరిజన గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో మంగళవారం మహిళల హక్కులపై, బాల్య వివాహాల నిర్మూలనపై, మాదక ద్రవ్యాలపై, సైబర్ నేరాలపై, మిషన్ వాత్సల్య పథకంపై దేవరకొండ డిఎస్పి శ్రీనివాసరావు విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలనకు కృషి చేయాలని అదే విధంగా విద్యార్థులు మంచిగా చదువుకోవాలని ఆయన సూచించారు. ఈకార్యక్రమంలో ఐసిడిఎస్ సిడిపిఓ చంద్రకళ, మైనంపల్లి సర్పంచ్ కొర్ర రాంసింగ్, బాలల హక్కుల రక్షణ కమిటి సభ్యులు అంజలి, తేజస్విని, మెడికల్ సూపర్వైజర్ సఫియాబేగం, సూపర్వైజర్లు విజయలక్ష్మి , చిట్టెమ్మ, ఎపిఎం విజయలక్ష్మి , ఏఎన్ఎంలు విజయ, విద్యార్థులు పాల్గొన్నారు.

## బాల్య వివాహాలు,పోక్సో చట్టంపై అవగాహన

ప్రజాపక్షం/మర్రిగూడ: మండలంలోని తిరుగండ్లపల్లి గ్రామపంచాయతీలో మంగళవారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో కిశోర బాలికల అవగాహన సదస్సు నిర్వహించారు.సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన సీడీపీవో సక్కుబాయి మాట్లాడుతూ బాలికలు సమతుల ఆహారం తీసుకోవడం, ఆరోగ్యం, చదువు ప్రాముఖ్యత,మానసిక దృఢత్వం,పరిశుభ్రత,శారీరక వ్యాయామంపై దృష్టి పెట్టాలని సూచించారు. సర్పంచ్ లక్ష్మమ్మ జంగయ్య గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈసమావేశంలో సూపర్వైజర్ సామ యశోద,ఏపీఎం వెంకటేష్,అంగన్వాడీ టీచర్లు నిర్మల,శ్రీదేవి,వీబీకేలు మానస,శాంతి, కిశోర బాలికలు,తల్లులు పాల్గొన్నారు.

**కిషోర బాలికలు పౌష్టికాహారాన్ని తీసుకోవాలి**

ప్రజాపక్షం/డిండి; కిషోర బాలికలు ఎదిగే వయస్సులో అనారోగ్యానికి గురికాకుండా పౌష్టికాహారం తీసుకోవాలని ఐసిడిఎస్ సూపర్వైజర్ అనిత సూచించారు. మంగళవారం మండలంలోని గోనబోయినపల్లి గ్రామంలో 99రోజుల ప్రణాళికలో భాగంగా బేటి బచావో బేటి పడావో కార్యక్రమం ఏర్పాటు చేసి కిషోర బాలికలకు గుడ్ టచ్ బ్యాడ్ టచ్, విద్యా ప్రాముఖ్యత, సోషల్ మీడియా వల్ల కలిగే నష్టాలను, బాల్య వివాహాలు చేసుకోవడం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు అరుణ, కళావతి, పార్వతమ్మ, జయలక్ష్మి , ఆశా వెంకటమ్మ, గర్భిణి, బాలింతలు, ప్రజలు కిషోర బాలికలు పాల్గొన్నారు.





## కృష్ణా నదిలో ఈతకు వెళ్లి బాలుడు మృతి

**ప్రజాపక్షం/తిరుమలగిరి సాగర్:** మండలంలోని నాయకుని తండాలో విషాదం చోటు చేసుకుంది. తండాకు చెందిన మేరావత్ బాలసైదా,సాల దంపతుల కుమారుడు మేరావత్ శోభన్ (12) సోమవారం కృష్ణా నదిలో ఈతకు వెళ్లి ఈత రాక నీట మునిగి మృతి చెందాడు. ఒక్కగానొక్క కుమారుడు చనిపోవడంతో కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు. గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## బాలికలు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలి



**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** కిషోర బాలికలు చదువుతో పాటు నాయకత్వ లక్షణాలను అలవర్చుకోవాలని కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం గ్రామ పంచాయతీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల గురించి బాలికలకు ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన బాలికలకు పలు సూచనలు చేశారు. ఈకార్యక్రమంలో సిడిపిఒ ఎండి. ఖతీజ, ఏపిఎం యాదయ్య, అంగన్‌వాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరి, సిసి రాజేశ్వరి, వివోఏలు, అంగన్‌వాడీ టీచర్లు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

## కృత్రిమ కొరత సృష్టించే బంక్‌లపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరతను సృష్టించే బంక్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ అన్నారు. మంగళవారం ఆయన స్తానికంగా మాట్లాడుతూ పెట్రోల్, డీజిల్ కృత్రిమ కొరతను సృష్టించడం వల్ల వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఆంధ్రాలో బంక్‌లు మూసి ఉంటే లైసెన్స్ రద్దు చేస్తామని ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటించడంతో ఆంధ్రాలో బంక్‌లు మొత్తం తెరిచి ఉన్నాయని, అదేవిధంగా తెలంగాణాలో సైతం బంక్‌లు మూసి ఉంటే కఠిన చర్యలు తీసుకోవాలని అవసరమైతే సీజ్ చేయాలని ఆయన సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు.

## ఆపద సమయంలో హెల్ప్ లైన్ నెంబర్లు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మహిళలు, బాలికలకు ఎలాంటి ఆపద వచ్చినా హెల్ప్ లైన్లను సద్వినియోగం చేసుకోవాలని సీడీపీవో రేఖల మమత అన్నారు. పట్టణంలోని హౌసింగ్‌బోర్డు, విద్యానగర్, సుభాష్‌నగర్‌లోని అంగన్‌వాడి కేంద్రాల్లో కిశోర బాలికలకు, మహిళలకు 1098, 100 హెల్ప్‌లైన్లపై అవగాహన కల్పించి ఆమె మాట్లాడారు. బాలికలపై జరిగే అఘాయిత్యాలపై, పోక్సో చట్టంపై వివరించారు. బాలికలు శ్రద్ధగా చదివి ఉన్నత స్థాయిలో రాణించాలన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ నాగమణి, పోషణ అభియాన్ బ్లాక్ కోఆర్డినేటర్ కవిత, అంగన్‌వాడి టీచర్లు చిన్నమ్మ, నర్మద, లత, కిశోర బాలికలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## బుద్ధ సందేశం సమాజానికి మార్గదర్శి



**ప్రజాపక్షం/నందికొండ:** గౌతమ బుద్ధుని జీవితం మానవాళికి మార్గదర్శకమని, ఆయన బోధనలు ప్రతి ఒక్కరూ తెలుసుకొని ఆచరణలో పెట్టాలని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్ పి.వి శ్రీనివాసరావు పేర్కొన్నారు.అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మితమైన నాగార్జునసాగర్‌లోని బుద్ధవనాన్ని రాష్ట్ర ఇన్ఫర్మేషన్ కమిషనర్లు పి.వి. శ్రీనివాసరావు,మోషిన్ పర్వీన్,దేశాల భూపాల్, బి.అయోధ్యరెడ్డి మంగళవారం సందర్శించారు.సోమవారం సూర్యాపేట జిల్లాలో రాష్ట్ర చీఫ్ ఇన్ఫర్మేషన్ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీఐ చట్టంపై జిల్లా అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. అనంతరం రాత్రి నాగార్జునసాగర్‌లోని టూరిజం విజయ విహార్ అతిథి గృహానికి చేరుకున్న కమిషనర్ల బృందానికి మిర్యాలగూడ ఇన్‌చార్జి సబ్ కలెక్టర్ వెంకటేశ్వర్లు స్వాగతం పలికారు.మంగళవారం ఉదయం టూరిజం లాంచీలో నాగార్జునసాగర్ జలాశయంలో విహారం అనంతరం బుద్ధవనాన్ని సందర్శించారు. ధ్యాన మందిరంలో బుద్ధ జ్యోతులను వెలిగించి ఆధ్యాత్మికతకు తమ గౌరవాన్ని వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో స్టేట్ ఇన్ఫర్మేషన్ కమిషన్ కార్యదర్శులు కే. ప్రమీల, డి.జె.వరలక్ష్మి, జె.రాము,పెద్దవూర తహసీల్దార్ బానోతు కాసిం,ప్రోటోకాల్ ఆఫీసర్ దండా శ్రీనివాస్ రెడ్డి,ఎస్ఐ ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

## గాలివానకు కూలిన విద్యుత్ స్తంభం.. తప్పిన పెను ప్రమాదం



**ప్రజాపక్షం/నందికొండ:** గాలివాన ప్రభావంతో మంగళవారం నందికొండ మున్సిపాలిటీలో విద్యుత్ స్తంభం విరిగి ప్రజలు సంచరించే రోడ్డుపై పడింది. అదృష్టవశాత్తూ ఆ సమయంలో విద్యుత్ సరఫరా లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది.స్థానికుల కథనం ప్రకారం, విరిగిపడిన స్తంభంతో పాటు వైర్లు కూడా రోడ్డుపై చెల్లాచెదురుగా పడిపోయాయి. ఆ సమయంలో కరెంటు సరఫరా కొనసాగి ఉంటే ప్రాణ నష్టం సంభవించేదని, రోడ్డుపై వెళ్లే పాదచారులు, వాహనదారులకు తీవ్ర గాయాలు, మరణాలు కూడా సంభవించేవని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన సబ్ స్టేషన్ ఫోన్ స్విచ్ ఆఫ్‌లో ఉండటంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ట్రాన్స్‌కో సిబ్బంది అప్రమత్తంగా వ్యవహరించాలని, దెబ్బతిన్న విద్యుత్ సదుపాయాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటన విద్యుత్ శాఖ అప్రమత్తత పెంచాల్సిన అవసరాన్ని స్పష్టం చేసిందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

## శ్రీనివాస్ రెడ్డి మరణం కాంగ్రెస్‌కి తీరనిలోటు



**ప్రజాపక్షం/చివ్వెంల :** దేవరం శ్రీనివాస్ రెడ్డి మరణం కాంగ్రెస్ పార్టీకి తీరనిలోటని తెలంగాణ రాష్ట్ర పర్యాటక అభివృద్ధి సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి అన్నారు. మండలంలోని గుంజలూరు గ్రామంలో ఇటీవల మృతి చెందిన కాంగ్రెస్ నాయకులు దేవరం శ్రీనివాస్ రెడ్డి అనారోగ్యంతో మృతి చెందడంతో మంగళవారం ఆయన కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న వయస్సులోనే శ్రీనివాస్ రెడ్డి మరణించడం బాధాకరమన్నారు. నిఖార్సైన కాంగ్రెస్ నాయకుడిగా మంచి గుర్తింపు పొందిన ఆయన గ్రామ పంచాయితీ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ఆయన ఎంతో కృషి చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీఉల్లా, గ్రామ సర్పంచ్ బొల్లికొండ సైదులు, సూర్యాపేట మాజీ మున్సిపల్ కౌన్సిలర్ వల్దాసు దేవేందర్, గ్రామ నాయకులు సుంకరి ఉపేందర్, కొప్పు భద్రాద్రి, సిలివేరు కిట్టయ్య, ఎక్కటి శ్యాంసుందర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఆర్థిక సాయం అందజేత

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** మండలంలోని చందనపల్లి గ్రామానికి చెందిన తెలగమళ్ల కాశిరాములు(67) సోమవారం అర్ధరాత్రి గుండెపోటుకు గురయ్యారు.కుటుంబ సభ్యులు వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.విషయం తెలుసుకున్న గ్రామ మాజీ సర్పంచ్ సురిగి రమేష్ గౌడ్ మంగళవారం కాశిరాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేసి ఓదార్చారు. ఆయన వెంట మాజీ వార్డు సభ్యుడు కాశీమల్ల విజయ్ కుమార్ తదితరులు ఉన్నారు.



## ఆర్థిక సాయం

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం అంబాల గ్రామానికి చెందిన రేగోటి నర్సయ్య మరణించడంతో సోమవారం మానవసేవే మాధవసేవ నినాదంతో ముందుకెళుతున్న మబ్బు అబ్బాస్ ఫౌండేషన్ చైర్మన్ మబ్బు మహేష్ నర్సయ్య కుటుంబాన్ని పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపి రూ. 5వేలు ఆర్థిక సాయంగా అందజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మల్లెపాక పరుశురాములు, మదన్‌మోహన్, రాజు, సురేష్, నవీన్, సర్పంచ్ రాణమ్మ యాదయ్య, ఉప సర్పంచ్ బీసు ప్రశాంత్, మహేష్, సత్తయ్య పాల్గొన్నారు.





## యువత మత్తుకు బానిసలు కావొద్దు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** యువత మత్తుకు బానిసలు కావద్దని మున్సిపల్ వైస్ ఛైర్మన్ గుడిపాటి శిరీషనవీన్ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా స్థానిక కేఎల్ఎన్ జూనియర్ కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడం, సైబర్ నేరాలు, కిశోర బాలికల గర్భధారణ సమస్యలపై అవగాహన కల్పించగా ఆమె ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ఆడ పిల్లలు అన్ని రంగాల్లో ముందుండాలన్నారు. పిల్లలు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎంఈవో ధర్మానాయక్, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ లీగల్ ఆఫీసర్ వెంకన్న, రమణి, సూపర్‌వైజర్ నాగమణి, నజీమా, ప్రిన్సిపాల్ రేపాల శ్రీనివాస్, కుర్ర కృష్ణకాంత్, హన్మంతరెడ్డి, నరేందర్‌రెడ్డి, దారం మల్లేష్, కవిత, చిన్నమ్మ, నర్మద, లత, సంధ్య, రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ బారి నుండి యువతను కాపాడుకుందాం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** డ్రగ్స్ బారి నుండి యువతను కాపాడుకుందామని పెన్‌పహాడ్ ఎస్ఐ గోపి కృష్ణ అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా మంగళవారం మండల కేంద్రంలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో సైబర్ మోసాల నివారణ, మహిళల భద్రత, బాలల రక్షణ, డ్రగ్స్ నిర్మూలనపై ప్రజలకు అవగాహన కల్పించారు. యువత తాత్కాలిక ఆనందం కోసం డ్రగ్స్ వంటి అలవాట్లకు లోనై తమ బంగారు భవిష్యత్తును ఆరోగ్యాన్ని పాడుచేసుకోవద్దని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## సాగర్‌లో మాజీ సీఎం భాస్కరరావు అస్థికలు నిమజ్జనం



**ప్రజాపక్షం/నందికొండ:** ఎపి పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ మంగళవారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు.తన తండ్రి, మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు అస్థికలను కృష్ణా నదిలో నిమజ్జనం చేయడానికి ఆయన ఇక్కడికి వచ్చారు.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్‌కు అధికారులు ఆత్మీయ స్వాగతం పలికారు.రెవెన్యూ ప్రోటోకాల్ ఆఫీసర్ దండా శ్రీనివాస్ రెడ్డి,స్థానిక ఎస్ఐ ముత్తయ్య పుష్పగుచ్ఛం అందించి ఆయనకు స్వాగతం పలికారు.కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రశాంత వాతావరణంలో అస్థికల నిమజ్జన కార్యక్రమం జరిగింది. తండ్రి జ్ఞాపకాలను స్మరించుకుంటూ మంత్రి నాదెండ్ల మనోహర్ నివాళులర్పించారు.మాజీ ముఖ్యమంత్రి నాదెండ్ల భాస్కరరావు ఈ నెల 22న మరణించారు. అధికారులు,స్థానిక పోలీసులు ఏర్పాట్లు చేసి కార్యక్రమం సజావుగా జరిగేలా సహకరించారు.

## కలెక్టర్‌కు వినతి



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** సూర్యాపేట జిల్లా కోర్టు నూతన భవన్ సముదాయానికి ప్రస్తుతం కేటాయించిన 8 ఎకరాల భూమితోపాటు అదనంగా మరో 5 ఎకరాల భూమిని కేటాయించాలని కోరుతూ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నూకల సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి తల్లమళ్ల హసేన్‌తోపాటు, సభ్యు లు వసంత సత్యనారాయణ పిళ్ళైతోపాటు పలువురు పాల్గొన్నారు.



## ధాన్యం దిగుమతిలో జాప్యం చెయ్యొద్దు

**ప్రజాపక్షం/నకిరేకల్:** రైస్ మిల్లర్లు ధాన్యం దిగుమతుల్లో ఎలాంటి జాప్యం చేయొద్దని జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్ సూచించారు. మంగళవారం నకిరేకల్ పరిధిలోని హరికృష్ణ పారా బాయిల్డ్ మోడరన్ రైస్‌మిల్లును ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన మిల్లులో నిల్వ ఉన్న ధాన్యం లారీలను పరిశీలించారు. రైతులు ఇబ్బందులు పడకుండా లారీలను వెంటనే దిగుమతి చేసుకుని, మిల్లింగ్ ప్రక్రియను వేగవంతం చేయాలని మిల్లర్‌కు ఆదేశాలు జారీ చేశారు. ధాన్యం నిల్వలు పేరుకుపోకుండా సకాలంలో దిగుమతి పూర్తిచేయాలని స్పష్టం చేశారు. డీసీఎస్ఓ టి.వెంకటేష్, డీఎంసీఎస్సీ నల్లగొండ రాంపతీ, సివిల్ సప్లై అధికారి రాచకొండ జ్యోతి పాల్గొన్నారు.

## ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/నకిరేకల్ :** మండలంలోని నోముల గ్రామంలో శ్రీ నాభి శిలా బొడ్రాయి వార్షికోత్సవ వేడుకలు మంగళవారం ఘనంగా జరిగాయి. ఉదయం నుండి సుప్రభాతము, నాదస్వరము,గణపతి పూజ,శ్రీచండీ హోమం నిర్వహించారు. మహిళలు జల బిందెలతో అభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పొట్ట బత్తుల జయమ్మ వెంకటేశం, ఉప సర్పంచ్ కోమటిరెడ్డి కిరణ్, మాజీ సర్పంచులు బాదిని వెంకటరమణ, కుంచం రమణమ్మ సోమయ్య, భీమన బో యిన వెంకటయ్య,కనకదుర్గ దేవాలయ శాశ్వత చైర్మన్ ముసుకు స్టాలిన్ రెడ్డి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ వరకాంతం శేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

## ఎల్లమ్మ, దుర్గమ్మ పండుగలో మాజీ ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/తుర్కపల్లి :** మండలంలోని దయ్యం బండ తండా గ్రామంలో జరుగుతున్న ఎల్లమ్మ, దుర్గమ్మతల్లి పండుగ వేడుకలో మాజీ ప్రభుత్వ విప్, ఆలేరు మాజీ ఎమ్మెల్యే, బిఆర్ఎస్ నియోజక వర్గ ఇంచార్జ్ గొంగిడి సునిత మహేందర్ రెడ్డి పాల్గొని, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలపార్టీ అధ్యక్షులు పిన్నపు రెడ్డి, నరేందర్ రెడ్డి, సాగర్ల పరమేష్ యాదవ్, కల్లూరి ప్రభాకర్ రెడ్డి పాల్గొన్నారు.



## హజ్‌యాత్ర విజయవంతం కావాలి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** హజ్ యాత్రను దిగ్విజయముగా పూర్తి చేసుకొని సురక్షితంగా తిరిగి రావాలని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాది ఆకాంక్షించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని స్టార్ బ్యాంకెట్ హాల్‌లో హజ్ యాత్రకు వెళ్లే భక్తులకు హజ్ కమిటి ఆధ్వర్యంలో సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాత్రలు మనసుకు ప్రశాంతతను, ఆధ్యాత్మిక శక్తిని అందిస్తాయన్నారు. ప్రయాణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా ధైర్యంగా ఎదుర్కొని, పరస్పర సహకారంతో యాత్రను విజయవంతంగా పూర్తి చేయాలన్నారు. పవిత్రమైన హజ్‌యాత్ర ప్రతి భక్తుడికి మంచి అనుభవాన్ని, ఆధ్యాత్మిక తృప్తిని అందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అంజద్‌అలీ, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, కౌన్సిలర్లు జహీర్, గునగంటి హేమసతీష్, తహేర్, హజ్ కమిటి జిల్లా అధ్యక్షులు హాఫీజ్ ఖలీల్ సాబ్ పాల్గొన్నారు.

## డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దాం



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి చేద్దామని బాలికల విద్యను ప్రోత్సహిద్దామని జిల్లా సంక్షేమ అధికారి కె. నరసింహారావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యా నిలయంలో ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మిషన్ వాత్సల్య పథకం కింద జిల్లా బాలల పరిరక్షణ విభాగం మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కిషోర బాలికల గర్భధారణ, మాదక ద్రవ్యాల వినియోగం, నిర్మూలన, సైబర్ నేరాలపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బాలికలు తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టడంతోపాటు జీవిత లక్ష్యాలపై దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిడబ్ల్యుసి చైర్పర్సన్ రమణారావు, జిల్లా బాలల పరిరక్షణ విభాగం సంక్షేమ అధికారి రవికుమార్, డిప్యూటి డిఎంహెచ్ఓ చంద్రశేఖర్, సిడబ్ల్యుసి మెంబర్ ధనమ్మ, ఎంఈఓ రవి, ఎస్ఓ ఆసియా జబీనా, ఎయిడ్ సంస్థ కమ్యూనిటి సోషల్ వర్కర్ వి. సోమన్న పాల్గొన్నారు.



## సభ్యత్వాలు చేపట్టాలి

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** త్వరలో జరగనున్న చేనేత సహకార సంఘాలలో ఓటు వేసేందుకు అర్హులైన కార్మికులకు సభ్యత్వాన్ని కల్పించాలని కోరుతూ మంగళవారం పోచంపల్లి పద్మశాలి చేనేత కార్మిక సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఏడి శ్రీనివాస్‌కు వినతి పత్రాన్ని సమర్పించారు. గత 45 సంవత్సరాల నుండి సభ్యత్వాలు ఇవ్వలేదని నిరసన తెలిపి అనంతరం జియో ట్యాగ్ కలిగిన ప్రతి కార్మికుడికి సభ్యత్వం ఇచ్చి తీరాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మున్సిపల్ చైర్మన్ తడక వెంకటేశ్వర్లు హాజరయ్యారు. సంఘం అధ్యక్షులు అంకం పాండు ఉపాధ్యక్షులు భారత భూషణం, మాజీ అధ్యక్షురాలు మెరుగు శశికళ, మంగళపల్లి శ్రీహరి పాండు, బోడ దయానందం, సహాయ కార్యదర్శి బిట్లు గణేష్, కోశాధికారి సూర్య ప్రకాష్ పాల్గొన్నారు.

## చెక్ డ్యామ్ నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/సంస్థాన్ నారాయణపురం :** మండలంలోని మహమ్మదాబాద్ గ్రామ పరిధిలోని దుబ్బల్లలో జాతీయ ఉపాధి హామీ పథకం ద్వారా 5 లక్షలతో మంజూరైన చెక్ డ్యామ్ నిర్మాణానికి సర్పంచ్ ముత్యాల అంజయ్య శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ వర్షపు నీటిని నిలువ చేసే భూగర్భ జలాలను పెంచడం రైతులకు ఏడాది పొడవున నీటి అందుబాటు కల్పించడం ఈ ప్రాజెక్టు లక్ష్యమని తెలిపారు. గ్రామ పరిసర ప్రాంతాల్లో నీటి కొరతను దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వం మంజూరు చేసిన పనులను నాణ్యతగా నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ మల్లేపల్లి నిర్మల, ఏటీఎం ప్రశాంతి, పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్ రవి, వార్డు సభ్యులు గ్రామ ప్రజలు రైతులు పాల్గొన్నారు.



## అకాల వర్షానికి రైతులు విలవిల

**ప్రజాపక్షం/మోటకొండూరు :** అకాల వర్షానికి రైతులు విలవిలలాడుతున్నారు. మోటకొండూరు మండలంలోని తేరియాల, చామాపూర్ ఆత్మ కూర్ మండలంలోని కోరటికల్, పల్లేపహడ్ తదితర గ్రామాలలో వడగండ్ల వర్షం పడడంతో చేతికొచ్చిన పంటలు వడ్లు రాలిపోగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పోసిన వడ్లు తడిసి ముద్దయినాయి, ఆరుగాలం చేసిన కష్టానికి అరగంటలో వచ్చిన అకాల వర్షం రైతులకు అపార నష్టం కలిగించింది. ముఖ్యంగా వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ఆరబెట్టిన ధాన్యం తడవడంతో తడిసిన వరిదాన్యం ఏలాంటి షరతులు లేకుండా కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

**వడగండ్ల వాన.. రైతుల్లో ఆందోళన**

**ప్రజాపక్షం/మర్రిగూడ:** మండలంలో మంగళవారం సాయంత్రం ఉరుములు,మెరుపులతో కూడిన వడగండ్ల వాన కురిసింది. వరి పంట కోత దశలో ఉండటంతో గింజలు రాలి నష్టం వాటిల్లుతుందని రైతులు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు.ఆరుగాలం కష్టపడి పండించిన పంట నేల పాలవుతుందని రైతులు ఆవేదన చెందుతున్నారు. చేతికొచ్చిన పంట చేజారిపోతుందేమోనని దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.ఈ విషయమై మండల వ్యవసాయ అధికారిని ఫోన్‌లో సంప్రదించగా,క్షేత్రస్థాయిలో పంట నష్టంపై సమాచారం తెప్పించుకుంటున్నామని తెలిపారు.నివేదిక సిద్ధం చేసి ఉన్నతాధికారులకు పంపుతామని పేర్కొన్నారు.



## మేడేను జయప్రదం చేయాలి

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** ప్రపంచ కార్మికులు పర్వదినం 141వ మేడేను జయప్రదం చేయాలని, పట్టణంలోని వాడవాడలా ఎర్రజెండాలను ఎగురవేయాలని ఏఐటియుసి ప్రాంతీయ అధ్యక్షులు దంతాల రాంబాబు పార్టీశ్రేణులను, కార్మికులను కోరారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని ధర్మబిక్షం భవన్‌లో ముఖ్య నాయకుల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ అన్ని సెంటర్‌లో ఏఐటియుసి అనుబంధ సంఘాల కార్మికులు, సిపిఐ కార్యకర్తలు, ప్రపంచ కార్మిక దినోత్సవం మేడేను వాడవాడలా గ్రామ గ్రామాన ఎర్రజెండాలను ఎగురవేసి మేడే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు, చివ్వెంల మండల కార్యదర్శి ఖమ్మంపాటి రాము, ఏఐవైఎఫ్ పట్టణ కార్యదర్శి ఎడెల్లి శ్రీకాంత్ పాల్గొన్నారు.

## ప్లాస్టిక్ వద్దు.. పర్యావరణమే ముద్దు!



**ప్రజాపక్షం/నకిరేకల్:** పర్యావరణాన్ని రక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని భావిస్తూ ఉపాధ్యాయులుజనాభా గణన శిక్షణలో భాగంగా పర్యావరణ పరిరక్షణపై తమకున్న మమకారాన్ని చాటుకున్నారు.మంగళవారం స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన అధికారుల శిక్షణలో రిఫ్రెష్‌మెంట్ కోసం పంపిణీ చేసిన ప్లాస్టిక్ ప్లేట్లు, గ్లాసులను వాడబోమని వారు సున్నితంగా తిరస్కరించారు. తాము వెంట తెచ్చుకున్న స్టీలు ప్లేట్లలో భోజనం చేస్తూ, స్టీలు గ్లాసుల్లో టీ తాగుతూ అందరికీ ఆదర్శంగా నిలిచారు. ఈ వినూత్న చొరవ చూపిన వారిలో ఉపాధ్యాయులు కనుకుంట్ల విద్యాసాగర్,కుర్మిళ్ళ శ్రీనివాస్,సట్టు గోపి,జెల్ల శైలజ,చౌగోని ఆండాలు, శ్రీలత, రమణమ్మ,సరోజినీ,వెంకటరమణ,శ్రీవాణి, సఫియా తదితరులు ఉన్నారు.సామాజిక బాధ్యతతో ప్లాస్టిక్ రహిత విధానాన్ని అవలంబించిన వీరిని పలువురు అభినందించారు.

## పేదలకు కంటి ఆపరేషన్లు



**ప్రజాపక్షం/నాంపల్లి:** మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో ఆయన మాతృమూర్తి కోమటిరెడ్డి సుశీలమ్మ ఫౌండేషన్ ఆధ్వర్యంలో వందలాది మంది పేదలకు ఉచితంగా కంటి శస్త్రచికిత్సలు నిర్వహించారు.అందులో భాగంగా మంగళవారం మండలంలో గతంలో ఆపరేషన్ చేయించుకున్న వారికి ఫాలోఅప్ పరీక్షలు నిర్వహించారు.ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కత్తి రవీందర్ రెడ్డి,జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు ఎరెడ్ల రఘుపతి రెడ్డి,మండల కాంగ్రెస్ సీనియర్ నాయకుడు పెద్దిరెడ్డి సంజీవ రెడ్డి,నాంపల్లి టౌన్ ఉప సర్పంచ్ పానగంటి నిర్మల వెంకన్న పాల్గొన్నారు.

## అల్పాహారం వితరణ



**ప్రజాపక్షం/నకిరేకల్ :** శ్రీ సత్య సాయి బాబా శతజయంతి ఉత్సవాలలో భాగంగా శ్రీ సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ప్రభుత్వా దావఖానలో అల్పాహారం వితరణ చేశారు. సత్య సాయి సేవా సమితి కన్వీనర్ గర్రె శ్రీనివాసులు,జిల్లా యువజన విభాగం సమన్వయకర్త దేవరశెట్టి సత్యనారాయణ తొడుపునూరి లక్ష్మణ్ కుమార్,మిట్టపల్లి యాదగిరి పాల్గొన్నారు.